2వ విడత కౌన్సెలింగ్‌కు వెరిఫికేషన్ తప్పనిసరి

పారిశ్రామిక శిక్షణ సంస్థ జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు

ప్రజాశక్తి - ఉండి

ఐటిఐ కోర్సుల్లో చేరదలుచుకున్న విద్యార్థులు రెండో విడత కౌన్సెలింగ్‌కు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తప్పనిసరి అని పారిశ్రామిక శిక్షణ సంస్థ జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు అన్నారు. పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో చేరదలుచుకున్న విద్యార్థులు జులై 15వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ జరుగుతుందని, ఆపై ఆ విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ చేయించుకోని విద్యార్థులు కౌన్సెలింగ్‌కు అనర్హులని వేగేశ్న శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఒక సంవత్సరం వెల్డర్ ట్రేడ్‌లో అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని సదరు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

విద్యాశాఖ మొద్దు నిద్ర..!

ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్ల దోపిడీకి అధికారుల వత్తాసు
నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫారం వంటివి విక్రయిస్తున్నా మౌనం
కనీస తనిఖీలు చేపట్టని విద్యాశాఖ అధికారులు
మామూళ్ల మత్తే కారణమని ఆరోపణలు
ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వెయ్యికిపైగా ప్రయివేటు విద్యాసంస్థలు
ఏలూరు జిల్లాలో 345 ప్రయివేటు స్కూళ్లు, 92 వేల మంది విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లోనూ విద్యాశాఖ అధికారులు మొద్దు నిద్ర నటిస్తున్నారు. కార్పొరేట్, ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాల దోపిడీకి వత్తాసు పలుకుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్కూళ్లలో పుస్తకాలు, బ్యాగులు, షూస్ వంటి వస్తువులు విక్రయిస్తున్నా విద్యాశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఫీజుల నుంచి పుస్తకాల కొనుగోలు వరకూ ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా రెచ్చిపోతున్నా విద్యాశాఖ అధికారులు కనీస తనిఖీలు సైతం చేయకపోవడం గమనార్హం. దీంతో ప్రయివేటు విద్యాసంస్థల దోపిడీ ఏయేటికాయేడు వటవృక్షంలా పెరిగిపోతున్న పరిస్థితి ఉంది. జిల్లా ఉన్నతాధికారులు సైతం విద్యాశాఖ తీరుపై సమీక్షా సమావేశాలు నిర్వహించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1,064 ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 202 వరకూ ఉండగా, యుపి స్కూళ్లు 422, హైస్కూళ్లు 440 వరకూ ఉన్నాయి. ఈ ప్రయివేటు విద్యాసంస్థల్లో రెండు లక్షల మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. విభజిత ఏలూరు జిల్లాలో 345 ప్రయివేటు విద్యాసంస్థలు ఉండగా 92 వేల మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. లక్షలాది మంది విద్యార్థులు చదువుతున్న ప్రయివేటు స్కూళ్లపై కనీస పర్యవేక్షణ లేకుండాపోయింది. విద్యాశాఖ అధికారులు మామూళ్ల మత్తులో పడి కనీసం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎల్‌కెజికి సైతం రూ.పది వేలకుపైగా వసూలు చేస్తున్నా.. అక్కడ ఉన్న కనీస ప్రమాణాలు ఏమిటో కూడా అధికారులు పట్టించుకోవడం లేదు. ఫీజులకు సంబంధించిన వివరాలు స్కూళ్ల బయట డిస్‌ప్లే చేయాలనే నిబంధనను ఏఒక్క స్కూల్ పాటించకపోయినా అడిగే నాథుడే లేకుండాపోయాడు. పుస్తకాలు, బ్యాగ్‌లు, షూస్, బెల్ట్ వంటి వస్తువులన్నీ స్కూల్‌లోనే తీసుకోవాలంటూ ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు హుకుం జారీ చేస్తున్నా అధికారులకు పట్టడం లేదు. పుస్తకాలు, ఇతర వస్తువుల పేరుతో ప్రతి విద్యార్థి నుంచి దాదాపు రూ.పది వేలకుపైగా గుంజుతున్న పరిస్థితి ఉంది. తల్లిదండ్రులు ప్రశ్నిస్తే తమ పిల్లలను ఇబ్బంది పెడతారనే భయం వెంటాడుతోంది. ఫిర్యాదు చేసినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోరనే అభిప్రాయం తల్లిదండ్రుల్లో నెలకొంది. విద్యాశాఖ అధికారులకు ఇదంతా తెలిసే సాగుతుందనే అభిప్రాయమూ జనాల్లో ఉంది. విద్యాశాఖ అధికారులు కనీసం పట్టించుకోకపోవడంతో ప్రయివేటు విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. సామాన్యులను పీల్చిపిప్పి చేస్తున్నాయి. ప్రభుత్వ స్కూళ్లలో కనీస సౌకర్యాలు ఉండకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయివేటు విద్యాసంస్థల్లో చేరుస్తున్నారు. ఇదే అదునుగా ప్రయివేటు యాజమాన్యాల దోపిడీకి అంతేలేకుండాపోయింది.

కనీస వసతులు లేకపోయినా భారీగా ఫీజులు

శ్రీ చైతన్య, నారాయణ, శశి వంటి కార్పొరేట్ విద్యాసంస్థలతోపాటు ఇతర ప్రయివేటు విద్యాసంస్థలు తాము చెప్పిందే వేదం అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. విద్యాశాఖ అధికారులను గుప్పెట్లో పెట్టుకుని ప్రయివేటు విద్యాసంస్థలు తమ దోపిడీని యథేచ్ఛగా సాగిస్తున్నాయి. స్కూళ్లలో కనీసం తాగునీటి సదుపాయంగాని, ఆటస్థలంగాని, చాలా స్కూళ్లు ఫైర్‌సేఫ్టీ నిబంధనలుగాని అమలు చేయడం లేదు. పాఠాలు బోధించే ఉపాధ్యాయులకు కనీస విద్యార్హతలు ఉండటం లేదు. అయినప్పటికీ ఫీజుల దోపిడీ మాత్రం సాగుతోంది. స్కూళ్ల అనుమతులు రెన్యువల్ చేసేటప్పుడు విద్యాశాఖ అధికారులు అన్ని నిబంధనలూ అమలవుతున్నాయో, లేదో పరిశీలించాల్సి ఉన్నా సక్రమంగా జరగడం లేదు. జిల్లాలో చాలా స్కూళ్లకు ఆటస్థలం కూడా లేదు. అత్యధిక స్కూళ్లలో డ్రిల్ పీరియడ్ సైతం తొలగించారు. ఫీజు చెల్లించడం ఆలస్యమైతే నేరస్తుల మాదిరిగా బయట నిలబెట్టి విద్యార్థులను హింసిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. అయినప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఎస్ఎఫ్ఐ వంటి విద్యార్థి సంఘాలు ప్రయివేటు విద్యాసంస్థల్లో పుస్తకాలు, బ్యాగుల పేరుతో ఏవిధంగా దోపిడీ చేస్తున్నారో స్కూల్స్‌కు వెళ్లి కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నారు. అయినప్పటికీ విద్యాశాఖ అధికారుల్లో పెద్దగా చలనం కనిపించడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా ప్రయివేటు స్కూళ్లలో జరుగుతున్న దోపిడీకి అడ్డుకట్ట వేయాలని, తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

భీమవరంలో..

పాలస్తీనా, ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ నిరసన

పెంటపాడులో..

ప్రజాశక్తి - భీమవరం

పాలస్తీనా, ఇరాన్‌లపై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం చౌక్‌లో గురువారం నిరసన చేపట్టారు. 'అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి, 'యుద్ధం వద్దు.. శాంతి కావాలి', పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ అమానుష ఊచకోతను అంతా ఖండించాలి అంటూ నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం నేత ఎం.వైకుంఠరావు, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకులు లంకా కృష్ణమూర్తి, సిపిఐ నాయకులు ఎం.సీతా రాంప్రసాద్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ దురాగతాలను అమెరికా అధ్యక్షులు ట్రంప్, మన ప్రధాని మోడీ బలపరుస్తున్న తీరు దారుణమని అన్నారు. సొంత గడ్డపైనే నిర్వాసితులుగా పాలస్తీనా ప్రజలు నివశిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా అండతోనే ఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో రెచ్చిపో తుందన్నారు. ఈ దాడులను ప్రజాస్వామ్యవాదులు అంతా ఖండించాలని, యుద్ధాన్ని ఆపాలని, ప్రపంచశాంతి నెలకొల్పాలని వారు కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.ఆంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, కె.కృష్ణ, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు దండు శ్రీనివాసరాజు, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

పెంటపాడు: పాలస్తీనా, ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులు తక్షణం ఆపాలని, యుద్ధం వద్దు.. శాంతి ముద్దు అంటూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ సిరపరపు రంగారావు, నేతలు చిర్ల పుల్లారెడ్డి, కండెల్లి సోమరాజు, బంకురు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇజ్రాయిల్ పాలస్తీనా మీద నెలలు తరబడి దాడులు చేయడం దారుణమన్నారు. కనీసం ఆహారాన్ని సైతం అందనీయకుండా అడ్డుకోవడం అన్యాయమన్నారు. తక్షణం ఈ దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కరక వెంకట్రావు, కర్రి సాయిరెడ్డి, దత్తు రాము, బుద్దాల సత్తిబాబు, మీసాల శ్రీను, పెనగంటి దుర్గ, ఆకుమూరి సుబ్బయ్య, కర్రి వెంకటరెడ్డి, పూడి బాలాజీ, తెర్లి రాజేష్, కొవ్వూరి పల్లారెడ్డి, మద్దాల ఆనంద్, కటారి చిట్టియ్య, విజయ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల్లో.. పేద పిల్లలకు 25 శాతం సీట్లు ఇవ్వాల్సిందే

అధిక ఫీజుల వసూలు, విద్యా మెటీరియల్ అమ్మకాలను సహించేది లేదు
ఎంఇఒలు, డివైఇఒలు, డిఇఒ క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాలి
కలెక్టర్ చదలవాడ నాగరాణి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పేద, మధ్య తరగతి కుటుంబాలు ప్రయివేటు పాఠశాలల్లో చదువులు మోయలేని భారమైనా కోటి ఆశలతో మొగ్గు చూపుతున్నారని, ఫీజుల భారమే కాకుండా, విద్యా సామగ్రి కొనుగోలు పేరిట వసూళ్లు మరింత భారాన్ని మోపుతున్నాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం స్థానిక విష్ణు కాలేజీ సమావేశ మందిరంలో జిల్లా విద్యశాఖ ఆధ్వర్యాన ప్రయివేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలు వారి పిల్లలు భవిష్యత్తును గొప్పగా ఊహించుకుని ఫీజులు భారమైనా ప్రయివేటు స్కూళ్లవైపే మొగ్గుచూపి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని, దీనికి తోడు పుస్తకాలు, విద్యాసామగ్రి, కల్చరల్ యాక్టివిటీస్, ఎక్స్‌ట్రా కర్క్యులర్ ఆక్టివిటీస్ పేరిట వసూళ్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అధిక ఫీజుల వసూలు, విద్య సామగ్రి అమ్మకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. విద్యార్థులకు బట్టీ చదువులు కాకుండా, విస్తృత పరిజ్ఞానాన్ని అందించేలా చదువులు ఉండాలన్నారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు స్వయంగా పరిష్కరించుకునేలా పరిజ్ఞానం నేర్పించాలన్నారు. ఈ సమావేశానికి హాజరైన వారు ఇక్కడ తెలియజేసిన ప్రతి అంశాన్నీ తు.చా తప్పకుండా పాటించాలన్నారు. కొన్ని పాఠశాలలు సిబిఎస్ఇ, ఐసిఎస్ఇ సిలబస్ అని చెప్పుకుంటున్నాయని, ఏ సిలబస్ అయినా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడపాల్సిందేనన్నారు. అధిక ఫీజుల వసూలుపై ఎంఇఒలు, డివైఇఒలు, డిఇఒ ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రయివేట్ పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్లను మాత్రమే నియమించాలని, పాఠశాల వేళలను రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేరకు కచ్చితంగా పాటించాలని సూచించారు. పేద కుటుంబాల పిల్లలకు 12-1 (సి) నిబంధనలకు లోబడి ప్రయివేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు తప్పకుండా కేటాయించాలని, ఇప్పటివరకు పాఠశాలలవారీగా 25 శాతం సీట్లు భర్తీ వివరాలను వెంటనే అందజేయాలని డిఇఒను ఆదేశించారు. పేదలకు 25 శాతం సీట్లు నిజంగా అమలవుతుందా, కాగితాలకే పరిమితం అవుతుందా అని విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. కచ్చితంగా అమలు చేయకపోతే చర్యలు తప్పవని పాఠశాలల యాజమాన్యాలను హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా యోగాంధ్ర పేరిట రాష్ట్రవ్యాప్తంగా యోగా కార్యక్రమాలను చేపట్టేందుకు ఆదేశించారన్నారు. దీనికి అనుగుణంగా ప్రతి పాఠశాల తప్పక రిజిస్టర్ కావాలని ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు జులై 15న మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలను నిర్వహించాలన్నారు. పేరుకే సమావేశం అన్నట్లుగా ఏర్పాటు చేస్తే కుదరదని, కచ్చితంగా పండగ వాతావరణంలో సమావేశాలను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌జెడి జి.నాగమణి, డిఇఒ ఇ.నారాయణ, ఎడి సత్యనారాయణ, ఎస్ఎస్ఎ పిఒ జి.శ్యామసుందర్, డివైఇఒలు ఎన్.రమేష్, మురళి సత్యనారాయణ, ఎంఇఒల సంఘం జిల్లా అధ్యక్షులు రవీంద్ర, అపుస్మా అధ్యక్షులు కిషోర్ కుమార్, ఎపిఎఎస్ అధ్యక్షులు మాణిక్యాలరావు, ప్రయివేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు, ఎంఇఒలు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖలో మౌలిక వసతుల కల్పనకు కృషి

జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ

వాహనాలను ప్రారంభిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పోలీసు శాఖలో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో భాగంగానే 16 మోటార్ సైకిళ్లను జిల్లాకు కేటాయించారని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ అన్నారు. గురువారం స్థానిక ఎస్‌పి కార్యాలయంలో జిల్లాకు కేటాయించిన 16 మోటార్ సైకిళ్లను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఈ వాహనాలను సద్వినియోగం చేసుకుని జిల్లా ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలను అందించడానికి ప్రతి పోలీసు అధికారీ, సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యలపై తక్షణమే స్పందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎఎస్‌పి వి.భీమారావు, జిల్లా ఆర్మ్డ్ రిజర్వు డిఎస్‌పి ఎంవివి.సత్యనారాయణ, భీమవరం డిఎస్‌పి ఆర్.జయసూర్య, నరసాపురం డిఎస్‌పి జి.వేద, సిఐలు వి.పుల్లారావు, దేశంశెట్టి వెంకటేశ్వరరావు, అహ్మదున్నీషా, వి.శ్రీనివాసరావు, డి.సురేష్, కె.వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అమలు చేయండి

అంగన్వాడీల ధర్నా

వినతి అందిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - ఆకివీడు

తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ అంగన్వాడీలు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఐసిడిఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్ రత్నకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీలకు ఏఒక్క సంక్షేమ పథకం అమలు కావడం లేదని అంగన్వాడీ నేత మార్తమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీల పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింప చేయలేదన్నారు. ప్రభుత్వమే రూ.12 వేలలోపు వేతనం పొందే ఉద్యోగులకు పథకాలు అమలు చేయాలని జిఒ ఇచ్చినా అమలు చేయకపోవడం దారుణమన్నారు. రిటైర్‌మెంట్ తర్వాత ఎటువంటి బెనిఫిట్స్ ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమానికి సిఐటియు నాయకులు బొడ్డుపల్లి రాంబాబు సంఘీభావం తెలిపి మాట్లాడారు.

కూటమి ప్రతి అడుగూ విద్యార్థుల కోసమే

ఎంఎల్‌ఏ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కూటమి ప్రభుత్వం వేసే ప్రతి అడుగూ విద్యార్థుల భవిష్యత్తు కోసమేనని రాష్ట్ర విప్, స్థానిక ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం పెదతాడేపల్లిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను విద్యార్థులకు అందజేశారు. అనంతరం విద్యార్థులకు ఎంఎల్‌ఎ స్వయంగా భోజనం వడ్డించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆహారం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పథకాల వల్ల ఉపయోగం లేదని, మంచి ఉద్యోగం ఇవ్వాలనే ఆలోచన తల్లిదండ్రులకు రావాలన్నారు. విద్య నేర్పిన ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. భవిష్యత్తు లక్ష్యాన్ని ముందుగానే నిర్ణయించుకోవాలని, లక్ష్యం లేని చదువు వంట పట్టదని అన్నారు. అనంతరం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌ను పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, ఎంఇఒ పిఎంకె జ్యోతి, పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావు, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మా పిల్లలను వేరే పాఠశాలకు పంపించం

ఎంఇఒ కార్యాలయంలో తల్లిదండ్రుల వినతిపత్రం


వినతి అందిస్తున్న సర్పంచి, విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

తమ పిల్లలను వేరే పాఠశాలకు పంపేది లేదని పెనుమంట్రలోని మండల పరిషత్ (ఎల్ఇ) ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు స్పష్టం చేశారు. వారు గురువారం బ్రాహ్మణచెరువులోని ఎంఇఒ కార్యాలయంలో ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచి టి.ప్రియాంక మాట్లాడుతూ విద్యాశాఖ ఏకపక్షంగా ఈ పాఠశాలలో 3, 4, 5 తరగతులను దూరంగా ఉన్న మెయిన్ పాఠశాలకు తరలించడం సరికాదన్నారు. అంతదూరం నడిచి వెళ్లడానికి చిన్న పిల్లలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. వెంటనే ఆయా తరగతులను ఎప్పటిలానే ఎల్ఇ పాఠశాలలోనే నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టిసిఎస్, విప్రోలకు ఛాంబర్స్ విద్యార్థుల ఎంపిక

పాలకొల్లు: స్థానిక ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం బిఎస్‌సి చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలు టిసిఎస్, విప్రోలకు ఎంపికయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటీవల టిసిఎస్, విప్రో కంపెనీలు నిర్వహించిన రాత, మౌఖిక పరీక్షల్లో జి.రాకేష్‌కుమార్, ఎ.జ్ఞాపిక భద్రాదేవ్, జె.సృజన, ఆర్.దుర్గ, టి.పూజిత టిసిఎస్‌కు, కె.యజ్ఞశ్రీ విప్రో కంపెనీకి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల ఛైర్మన్ కారుమూరి నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులకు అకడమిక్ ప్రోగ్రాం అందిస్తూ, మరోపక్క కమ్యూనికేషన్ స్కిల్స్, రీజనింగ్ అర్థమెటిక్, కంప్యూటర్ స్కిల్స్ బోధించడం ద్వారా తమ విద్యార్థులు టిసిఎస్, విప్రో వంటి ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు సంపాదిస్తున్నారని అన్నారు. కళాశాల సెక్రటరీ కె.సీతారామరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో అకుంఠిత దీక్ష, ముందుచూపు, కష్టపడే తత్వం, విషయ అవగాహన వంటి వాటికి తోడు ఉపాధ్యాయుల శిక్షణ తోడైతే లభించే ప్రతిఫలం మంచి ఉద్యోగావకాశాలేనని తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ ప్రవీణ్‌భాను, అకడమిక్ అడ్వయిజర్ నందుల సీతారామ్, డాక్టర్ ఎబిఎస్.మూర్తి, ప్లేస్‌మెంట్ అధికారులు జానకిరామయ్య, మీనా పాల్గొన్నారు.

భీమవరంలో 6 వేల మందితో యోగా సందడి

కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ


యోగాలో విద్యార్థులు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో ఆరు వేల మందితో యోగా సందడిగా మారడం అభినందనీయమని, ప్రపంచంలో 180 దేశాల్లో యోగా సాధన ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. యోగాంధ్రలో భాగంగా గురువారం స్థానిక డిఎన్ఆర్ కళాశాల గ్రౌండ్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆధ్వర్యంలో జిల్లాకు కేటాయించిన ప్రత్యేక థీమ్ అథ్లెటిక్స్, స్పోర్ట్స్ గ్రూప్స్, యూత్ గ్రూప్స్‌తో నిర్వహించిన మెగా యోగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ యోగా భారతదేశ ప్రాచీన సంపదని, భారతదేశం యోగాను ప్రపంచానికి పరిచయం చేసిందన్నారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం విశాఖపట్నంలో నిర్వహించి ప్రపంచ రికార్డు సాధించనున్నామన్నారు. రాష్ట్ర పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని అన్నారు. ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగా చేసి ఆరోగ్యవంతంగా జీవించాలన్నారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ వేల మందితో యోగా కార్యక్రమంలో పాల్గొన్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఎఎస్‌పి వి.భీమారావు, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్‌డిఒలు కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దాసి రాజు, డిఎస్‌పిలు ఆర్.జయసూర్య, డాక్టర్ జి.శ్రీవేద, డిఇఒ ఇ.నారాయణ, జిల్లా టూరిజం అధికారి ఎవి.అప్పారావు, అంతర్జాతీయ యోగా టీచరు టి.శిరీష, డిఎన్ఆర్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంటు గాదిరాజు సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షులు గోకరాజు పాండురంగరాజు, వివిధ శాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగు కళాశాల, శ్రీ విష్ణు ఇంజినీరింగు కళాశాల, భారతీయవిద్యా భవన్, నారాయణ జూనియర్ కళాశాల, చైతన్య, ఆదిత్య, భాష్యం తదితర విద్యాసంస్థల ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకూ పోరాడతా..

బాధితురాలు దుర్గాభవాని

దుర్గాభవానీకి మద్దతుగా కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - నరసాపురం

భర్త, అత్తమామలు ఇంటి నుంచి గెంటేయడంతో ఆందోళన చేస్తున్న బర్రె దుర్గాభవాని రెండో రోజు గురువారం అత్తింటి వద్ద దీక్షను కొనసాగించింది. రెండో రోజు ఆమెకు కుటుంబ సభ్యులు మద్దతుగా నిలిచారు. న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తానని దుర్గాభవాని తెలిపారు. విషయం తెలుసుకున్న మండలంలోని పాత నవరసపురం గ్రామానికి ఐసిడిఎస్ సిబ్బంది వెళ్లారు. దుర్గాభవానిని కలిసిన ఐసిడిఎస్ సూపర్ వైజర్ పద్మావతి, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిఎస్‌పి శ్రీవేదను గురువారం దుర్గ భవాని బంధువులు కలిసి సమస్యను వివరించి న్యాయం చేయాలని కోరారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని డిఎస్‌పి వారికి హామీ ఇచ్చారు.

కార్మికులకు శీతలపానీయాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉపాధి కూలీలకు శీతల పానీయాల పంపిణీ

ప్రజాశక్తి - పోడూరు

ఉపాధి కూలీలకు దాతల సహకారం వెలకట్టలేనిదని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మోడీ మోజెస్ అన్నారు. మండలంలోని తూర్పుపాలెం ఆనందరావు పేటలో గురువారం సర్పంచి కాకెం సందడరావు ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు చల్లని పానీయాలు అందజేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి వేతన బకాయిలు వెంటనే వారి బ్యాంక్ ఖాతాలోకి జమచేయాలన్నారు. 200 రోజులు పని కల్పించాలన్నారు. రూ.600 వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మేకేలు అరిగెల కిషోర్, కర్రి చిన్నారి, ఎస్.సరోజ, పి.సరళ ఉపాధి కూలీలకు బీ, బిస్కెట్ ప్యాకెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.సంపత్‌రావు, ఎ.సత్రిరాజు, కె.మహేశ్వరావు, సతీష్, రాజకుమార్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ఎంఎల్‌ఎ పులపర్తి అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగి సమాజానికి పాటుపడాలని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. గురువారం స్థానిక నెహ్రూపేట మున్సిపల్ పాఠశాలలోని 109 మంది విద్యార్థులకు ఎంఎల్‌ఎ చేతుల మీదుగా నోట్ పుస్తకాలు అందించారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని అన్ని రంగాల్లో రాణించాలని, వారికి కావాల్సిన సౌకర్యాలు ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా పాటుపడాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయినికమల, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ పుట్టినరోజు

ప్రజాశక్తి - ఆచంట

కాంగ్రెస్ యువ నాయకులు రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు గురువారం ఆచంట రైతు సంఘం భవనంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరికుమార్ రాజు పాల్గొని మాట్లాడుతూ దేశం కోసం, పేద ప్రజల కోసం నిరంతరం కష్టపడుతున్న ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. ఆచంట నియోజకవర్గ ఇన్‌ఛార్జి నెక్కంటి వెంకట సత్యనారాయణ, ఆచంట, పెనుగొండ మండలాల అధ్యక్షులు నెక్కంటి బంగారం, సరళ మధు, నాయకులు పాల్గొన్నారు.

జంధ్యాల,వేణుమాధవ్‌కు నివాళి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

హాస్యకథా చిత్రాలు తీయడంలో జంధ్యాల అందె వేసిన చేయి అని పలువురు వ్యక్తలు అన్నారు. భీమవరం వెంకట్రామ థియేటర్ కాన్ఫరెన్స్ హాల్లో హాస్యబ్రహ్మ జంధ్యాల, ప్రపంచ మిమిక్రీ కళలో అగ్రగణ్యులు పద్మశ్రీ నేరాళ్ల వేణు మాధవ్ సంస్మరణ కార్యక్రమాన్ని గురువారం సంస్కార భారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళారంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది శ్రీనివాస్, సంస్కార భారతి కార్యదర్శి చెరుకువాడ రంగసాయి, శోభన్ బాబు సేవా సమితి అధ్యక్షుడు భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ జంధ్యాల పండించిన హాస్యం, వేణు మాధవ్ మిమిక్రీలు జగత్తులో కళారంగంలో గొప్ప విశేషాలన్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి సభ్యులు ఎస్‌కె.చాన్ భాషా, రాంబాబు, పులపర్తి శ్రీనివాస్, జి.కుమార్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : యోగా చేస్తున్న ఎంఎల్‌ఎ, అధికారులు

యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

యోగా సాధన వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని భీమవరం హెడ్ పోస్ట్ మాస్టర్ ఎ.రాజు అన్నారు. యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలంటూ శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో హెడ్ పోస్ట్ కార్యాలయంలో గురువారం ప్రచార భేరి నిర్వహించారు. రాజు మాట్లాడుతూ నెల రోజుల నుంచి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకూ యోగా అవగాహనా కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ జొన్నలగడ్డ శ్రీనివాస్‌రావు, పోస్టల్ యూనియన్ నాయకులు లెనిన్, వి.రామకృష్ణ, భాస్కర్ రాజు పాల్గొన్నారు.

గణపవరం : గణపవరం డిగ్రీ కాలేజీలో గురువారం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, మండల పరిషత్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వెయ్యి మందితో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శారీరక, ప్రశాంతత ఒత్తిళ్లను తట్టుకొని నిలబడిగలిగే సామర్థ్యం పెంచుకోవడానికి యోగా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ప్రధాన సెంటర్లో ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి, లయన్స్ క్లబ్ జిల్లా నాయకులు ఈపూరి సత్యనారాయణ, గణపవరం సర్పంచి మూరా అలంకారం, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : మానసికోల్లాసానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కడకట్ల, యాగర్లపల్లి రెండో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై మెగా యోగా కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ ప్రారంభించి మాట్లాడారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 21న వైజాగ్ లో ప్రధాని మోడీ ఆధ్వర్యంలో జరిగే మెగా యోగా కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, తహశీల్దార్ సునీల్ కుమార్, ఎంపిడిఒ విశ్వనాథ్, డిపిఒ మల్లికార్జునరావు, నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థులు సెల్ ఫోన్లు వదిలి పెట్టి, చదువు మీద దృష్టి పెట్టాలని జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి అన్నారు. గురువారం మార్టేరు బసంతీదేవి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన డాక్టర్ సర్వేపల్లి విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పిల్లలు మంచి గోల్స్ పెట్టుకొని అందుకు తగ్గట్టుగా చదువులో ముందుకు సాగాలని మార్టేరు గ్రామ ఉప సర్పంచి కర్రి వేణుబాబు కోరారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ గణేష్, ప్రముఖులు మట్టా రాము, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

షట్టర్లు, లాకులు బాగు చేసేదెప్పుడు..?

రైతుల ఆవేదన

ప్రజాశక్తి - ఉండి

ఉండి ప్రధాన పంట కాలువలో ఉన్న లాకులను, షట్టర్లను బాగు చేసేది ఎప్పుడు అని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. సార్వా సాగు ప్రారంభమవుతున్నా ఇరిగేషన్ అధికారులు లాకులకు, షట్టర్లకు మరమ్మతులు చేసే విషయంలో మీనమేషాలు లెక్కించడం సరికాదంటున్నారు. నీటిపారుదల శాఖ విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబించింగా, ప్రస్తుత ప్రభుత్వంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబించడం దారుణమని విమర్శిస్తున్నారు. ఉండి బల్లవంతెన సమీపంలోని ఇరిగేషన్ గేటుకు లాకులు, షట్టర్ పని చేయకపోయినప్పటికీ అలానే వదిలేయడం సరికాదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ గేటు నుంచి సుమారు పాతిక ఎకరాల వ్యవసాయ భూమికి నీరు వెళ్తుందని, అయితే ఆ గేటుకు ఉన్న లాకు షట్టర్ పని చేయకపోవడంతో అవసరమైన నీరు వెళ్లకుండా పంట భూములు నిరుపయోగంగా మారుతున్నాయని వాపోతున్నారు. బల్ల వంతెన వద్ద ఉన్న గేటు సమీపంలో రైల్వే స్టేషన్ వరకూ ఉన్న బోదెకు అడ్డుగా గోడ కట్టి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు నిద్రమత్తు వీడి బల్ల వంతెన సమీపంలోని గేటు మరమ్మతు పనులు చేయించాలని, బోదె ఆక్రమించి కట్టిన గోడను కూల్చివేయాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టకుండా వదిలేసిన గేటుకు లాకులు, షట్టర్

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకొస్తాం

పార్టీ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరికుమార్ రాజు

ప్రజాశక్తి - ఆచంట

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో ముందుకొస్తున్నారని పార్టీ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరికుమార్ రాజు అన్నారు. గురువారం స్థానిక రైతు సంఘం కార్యాలయంలో ఆచంట నియోజకవర్గ ఇన్‌ఛార్జి నెక్కంటి వెంకట సత్యనారాయణ (సతీష్) అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన హరికుమార్ రాజు మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీన భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ భవనంలో జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరుగుతుందని, కార్యకర్తలు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఆచంట నియోజకవర్గ ఇన్‌ఛార్జి సతీష్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. అన్నదాత సుఖీభవ అమల్లో ప్రభుత్వం అన్నదాత పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని వాపోయారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చాలని లేనిపక్షంలో ప్రజలు తిరుగుబాటుకు గురికాక తప్పదని హెచ్చరించారు. ఆచంట పెనుగొండ మండలా అధ్యక్షులు నెక్కంటి బంగారం, సరళ్ల మధు, నాయకులు చిలుకూరి రామచంద్రరావు, సజ్జా రామారావు, వైట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హరికుమార్ రాజు

మహిళల అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆకివీడు

యువతులు, మహిళలు ప్రతిరోజూ అక్రమ రవాణాకు గురవుతున్నారని, ఈ నేపథ్యంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సేవా సంస్థ సమన్వయకర్తలు అనిల్‌కుమార్, మిథాలీ రాజ్ అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళల అక్రమ రవాణాపై అంగన్వాడీలకు అవగాహనా కార్యక్రమం ఐసిడిఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ ఈ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతి పెద్ద నేరంగా పరిణమించిందన్నారు. ముఖ్యంగా ఉద్యోగం, సినిమా అవకాశాల ద్వారా మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారన్నారు. సంబంధిత మహిళా శిషు సంక్షేమ శాఖ, పోలీస్, విద్యా శాఖ, న్యాయ శాఖల సమన్వయంతో సంస్థ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 29,200 మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పించామని తెలిపారు. పిల్లలు ఏదైనా ప్రమాదం ఉందని గమనిస్తే వెంటనే 1098, 100, 181, 1930 వంటి టోల్ ఫ్రీ నెంబర్స్‌ను ఉపయోగించుకోవాలన్నారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి చట్టాలపై అవగాహనా కల్పించారు. అనంతరం అంగన్వాడీలు, కార్యకర్తలు మానవహారం చేపట్టారు. ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కుమారస్వామి ఆలయ భూములను రక్షించండి

రైతుల ఆవేదన

ప్రజాశక్తి - ఆచంట

దేవస్థానం అభివృద్ధికి సహకరించాల్సిన ఆలయ ఇఒ రాజకీయాలు చేస్తూ తప్పించుకు తిరుగుతున్నాడని కరుగోరుమిల్లి గ్రామానికి చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కరుగోరుమిల్లిలో శ్రీ కుమారస్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ పంట పొలాల ఆదాయానికి గండి కొడుతూ విఘాతం కలిగిస్తున్నారని రైతు ముత్యాల నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. కుమారస్వామి దేవస్థానానికి 18 ఎకరాల పంట భూమి ఉందని తెలిపారు. గత సంవత్సరం పాట పెట్టారని, రైతులు సేద్యం చేసుకుంటున్నారని, అయితే ప్రస్తుత ఆలయ ఇఒ లోకేష్ మళ్లీ దేవస్థాన భూములకు ఈ నెల 10న అర్హులైన రైతులు సేద్యం చేసుకునేవారు పాట పాడుకోవాలని గ్రామంలో ఈ నెల 7వ తేదీన టాంటాం వేయించారని తెలిపారు. ఈ భూములను 2024లో మూడేళ్లకు గాను పాట పెట్టినప్పటికీ మరలా ఇప్పుడు పాట పెడుతున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లోకేష్ టామ్ టామ్ వేయించారని తెలిపారు. ఇదంతా కావాలని చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 10న భూముల పాటకు రైతులు సాల్విన్స్ సర్టిఫికెట్లు తీసుకుని దేవస్థానం వద్దకు రాగా పాట నిర్వహించడం లేదని చెప్పడంతో రైతులు ఆగ్రహించి ఇఒ లోకేష్‌ను నిలదీశారని తెలిపారు. తప్పకుండా జూన్ 18న పాట నిర్వహిస్తానని సభాముఖంగా రాసి ఇచ్చారని తెలిపారు. 18న రైతులు దేవస్థానం వద్దకు రాగా ఇఒ రాకపోవడంతో పాటు ఆయన ఫోన్ స్విచ్‌ఆఫ్ చేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రైతులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. అనంతరం విలేకరులతో ఇఒ మాట్లాడుతూ ఈ భూములపై కొంతమంది రైతులు స్టే వేశారని ఇప్పుడు పాట నిర్వహించడం సాధ్యం కాదని తెలిపారు. ఇది రాజకీయ ఎత్తుగడలో భాగమేనని రైతులు చెబుతున్నారు.

ధ్యాన్ చంద్‌ను సన్మానిస్తున్న మాజీ ఎంఎల్‌ఎ మాధవనాయుడు

ధ్యాన్ చంద్‌కు సత్కారం

ప్రజాశక్తి - నరసాపురం

మొగల్తూరు మండలం రామన్న పాలెంకు చెందిన అయితం ధ్యాన్‌చంద్ ఇటీవల 2024 - 25 గాను ఆచార్య ఎన్‌జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డాక్టర్ ఎంవి.రెడ్డి ఉత్తమ రైతు అవార్డు 2024 అందజేశారు. ఈ సందర్భంగా నరసాపురం మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు సరిపల్లిలో ఆయన నివాసంలో ధ్యాన్ చంద్‌ను పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి చిటికెల రామ్మోహనరావు, సర్పంచి ఈదా సురేష్, తంగెళ్ల నాగేశ్వరరావు, కొట్టు పండు, బస్వాని ఏడుకొండలు, రేవు ప్రభుదాసు, మెరుగుమువ్వల రాంప్రసాద్, కుక్కల రవి, చాగంటి రాము, చాగంటి సురేష్, నరేంద్ర, కొండేటి శ్రీను, నడిపూడి శ్రీను, లక్కు శేషు పాల్గొన్నారు.

బాలాజీని సత్కరిస్తున్న ఎంపిడిఒ

బాలాజీ సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌గా తోలేటి బాలాజీ ఎనలేని సేవలు అందించారని ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి అన్నారు. మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తోలేటి బాలాజీ అత్తిలి మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయంలో బాలాజీని కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి ఎం.నవీన్‌కిరణ్, సీనియర్ అసిస్టెంట్ మౌనిక, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'తల్లికి వందనం పేరుతో కూటమి మోసం'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తల్లికి వందనం అమల్లో భాగంగా వివిధ షరతులు విధించి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 29 లక్షల మంది విద్యార్థులకు కూటమి ప్రభుత్వం డబ్బులు ఎగనామం పెట్టిందని ఎఐఎస్ఎ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి విమర్శించారు. గురువారం తాడేపల్లిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎఐఎస్ఎ కార్యకర్తల సమావేశం పి.రాజేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి మాట్లాడుతూ తల్లికి వందనం పేరుతో కూటమి ప్రభుత్వం విద్యార్థులను మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 29 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం డబ్బులు ఎగనామం పెట్టారని విమర్శించారు. మొత్తం ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని నియమించారు. కమిటీ అధ్యక్షులుగా ఆర్.సాయి, కార్యదర్శిగా పి.పూర్ణ తదితరులను నియమించారు. ఎ.అజయ్, ఎం.అశ్విని, ఎ.ధనేష్ పాల్గొన్నారు.

నరసింహస్వామి మృతి తీరని లోటు

ప్రజాశక్తి - మొగల్తూరు

టిడిపి సీనియర్ నాయకులు బంధన నరసింహస్వామి మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవ నాయుడు, మాజీ మంత్రి రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. నరసింహస్వామి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని గురువారం మాధవ నాయుడు, సుబ్బారాయుడు వేరువేరుగా సందర్శించి నివాళులర్పించి మాట్లాడారు. ఆయన లేని లోటు పార్టీకి తీరనిది అన్నారు. నరసింహస్వామి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట బస్వాని ఏడుకొండలు, బంధన నాగార్జున, దాసరి శ్రీనివాస్, కొల్లాటి హరికృష్ణ , వెంకటేష్, రాజు ఉన్నారు.

నరసింహస్వామి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాధవనాయుడు

స్వర్ణాంధ్రలో సెమినార్

ప్రజాశక్తి - నరసాపురం

సీతారాంపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో బిటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న సిఎస్ఇ, ఐటి, సిఎస్ఇ డేటా సైన్స్ విద్యార్థులకు ఐసిటి అకాడమీ ఎపి యూనిట్ వారు సెమినార్ నిర్వహించారు. ఐటిసి అకాడమీ హెడ్ ఎస్. దినకర్ రెడ్డిచే విద్యార్థులు ఉపాధి పొందడం ఎలా, విలువలు పెంపొందిచుకోవడం ఎలా, నైపుణ్యం సాధించుకోవడం ఎలా అనే మూడు అంశాల గురించి సూచనలు అందించారు. ఇటీవలే ఐసీటీ అకాడమీ నందు స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కాలేజీ వారు సభ్యత్వం పొందడం జరిగినది తద్వారా విద్యార్థులు మరింత ఉపాధి అవకాశాలు పొందగలరని కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ తెలిపారు. కళాశాల ట్రెజరర్ కెవి.స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, కళాశాల ప్రిన్సిపల్ ఎస్.సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎ.గోపీచంద్, టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దినకర్ రెడ్డి

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట, పోడూరు మండలాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నరసాపురం విద్యుత్ శాఖ అధికారి ఇఇకె మధు కుమార్ గురువారం విలేకరులకు తెలిపారు. ఆచంట 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటినెన్స్ కారణంగా కొత్త స్తంభాలు వేయడం, చెట్టుకొమ్మల తొలగింపు నిమిత్తం మండలంలోని 12 గ్రామాలతోపాటు వద్దిపర్రులో విద్యుత్ కోతలు ఉంటాయని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని మధుకుమార్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేదు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 20వ తేదీ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకూ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేదని విద్యుత్ శాఖ నరసాపురం ఎఇ కె.మధుకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందు అంతరాయం ఉంటుందని పత్రికల్లో ప్రకటన ఇవ్వడం జరిగిందని, అయితే అనివార్య కారణాల వల్ల చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమం ఆపివేసినట్లు తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

గొర్రెలకు టీకాలు

ప్రజాశక్తి - నరసాపురం

గొర్రెలకు ఉచిత నీలి నాలుక టీకా వేయించాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి కె.మురళీకృష్ణ అన్నారు. చిట్టవరం గ్రామంలో గురువారం గొర్రెలకు, నీలి నాలుక వ్యాధి నివారణకు టీకా కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. గ్రామంలో 800 గొర్రెలకు టీకాలు వేసినట్లు సురేంద్ర తెలిపారు. మండలంలో సుమారు 9000 గొర్రెలు ఉన్నాయని, గొర్రెల కాపరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం పశు వైద్య అధికారి సురేంద్ర కుమార్, వెటర్నరీ సహాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచి రామారావు మృతి

ఆకివీడు: మండలంలోని కోళ్లపర్రు గ్రామ మాజీ సర్పంచి ఎండపల్లి రామారావు (74) మరణించారు. ఆయన హయాంలోనే గ్రామంలో తారు రోడ్లు నిర్మించారు. ఆయన మృతి పట్ల ప్రముఖులు సంతాపం తెలిపారు.

డాక్యుమెంట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, పెనుగొండ గ్రామానికి చెందిన కమరకోట కృష్ణ, తండ్రి : పుల్లయ్య, గుబ్బల వారి వీది కి చెందిన అను నేను నా యొక్క డాక్యు మెంట్ పడిపోయింది. ఇంటి దగ్గరనుండి జిరాక్స్ సెంటర్ కు వెళు తుండగా నాయొక్క లింక్ డాక్యు మెంట్ నెంబర్ : 354/1995 గల డాక్యు మెంట్ పడిపోయింది. డాక్యు మెంట్ ఏవరికైన దొరకిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియ జేయగలరు.

కమరకోట కృష్ణ
C/o: పుల్లయ్య
డోర్ నెం: 15-32
గుబ్బల వారి వీధి
పెనుగొండ, పెనుగొండ మండలం,
సెల్ నెం: 97018 56621

పాస్‌పోర్ట్ పోయినది

కోళ్ళ పెద్ది లక్ష్మి, భర్త, పెద్దిరాజు, డోర్ నెంబర్ 1-175, గుబాలగుంట, కొత్తపేట, దిగమర్రు, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా

నేను వైజాగ్ పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి 04-02-2010 న **H7985227** నెంబర్ పాస్పోర్ట్ తీసుకున్నాను. నేను నా ఒరిజినల్ పాస్ పోర్ట్ ను తీసికొని ది. 15-01-2025 న మా ఇంటి నుంచి పాలకొల్లుకు మోటార్ సైకిల్ పై జెరాక్స్ కాపీలు తీయించుటకు రాగా దారిలో నా ఒరిజనల్ పాస్ పోర్ట్ పడిపోయింది. దారిలో ఎంత వెదికినా దొరకలేదు. కాబట్టి నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన నా పై అడ్రస్ కు అందజేయగలరు.

నా సెల్ నెం: 93905 23193

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, పోలమూరు గ్రామం, కాకరవారి పాలెం గ్రామ కాపరస్తులైన నంగలం ముసలయ్య, తండ్రి: రామలింగం అను నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. నేను పై అడ్రసు నందు నివాసము ఉంటున్నాను. నాకు పాస్‌పోర్టు ఉన్నది. నేను కూలిపని చేసుకొని జీవనం సాగిస్తున్నాను. నేను కాకర్లవారి పాలెంలో ఉన్న మురికి కాలువ ప్రక్కన ఉన్న గుడిసెలో నా కుటుంబంతో కలసి నివాసము ఉంటున్నాను. 2024లో వచ్చిన బారీ వర్షాల కారణంగా నా గుడిసెకి ఆనుకొని ఉన్న మురికి కాలువ పొంగి మా సామాన్లు కొన్ని కొట్టుకుపోయాయి. అందులో నా పాస్‌పోర్టు కూడా ఉన్నది. కావున దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నంబరుకు తెలియజేయగలరు.

నంగలం ముసలయ్య
పోలమూరు గ్రామం
పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా
సెల్ నెం: 93907 41549

ప్రకటన
మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం
ఐ.పి.నెం. 5/2024

బిట్వీన్:
శ్రీ కత్తుల వెంకటేశ్వరరావు ...పిటీషనర్
మరియు
జడ్డు ఆదినారాయణ మరియు 19 మంది వగైరా ...రెస్పాండెంట్స్

సమన్స్ టు:
R-8: పీతల రవీంద్ర, పురుషుడు, వయస్సు 45 సం.రం, ఆర్.టి.సి. ఎంప్లాయ్ (DME), APSRTC డిపో, నరసాపురం, నరసాపురం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

మీ పై కత్తుల వెంకటేశ్వరరావు అను వారు ఫైల్ చేసిన ఐ.పి లో మీరు ఎనిమిదవ ప్రతివాది అయియున్నారు. మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం, ప॥గో॥జిల్లా వారు మీకు ఎన్నిసార్లు రిజిష్టర్ పోస్ట్ ద్వారాను, మరియు శ్రీ కోర్టు వారి ద్వారాను నోటీసులు పంపించినప్పటికీ ఐ.పి సమన్లు మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా **ది. 11-07-2025 సం.రం తేదిన ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టులో హాజరు అయి మీ ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేని యెడల పరోక్షమున సదరు ఐ.పి విచారించబడి, తీర్మానించబడునని మీకు తెలియజేయుచున్నాము.

జి.పి. సుదర్శనరావు
నరసాపురం పిటీషనర్ తరపున న్యాయవాది
తేది. 19-06-2025 నరసాపురం
సెల్ నెం. 99856 49898

IN THE COURT OF THE CHAIRMAN MOTOR ACCIDENT CLAIMS TRIBUNALS-CUM-III ADDL. DISTRICT JUDGE:RANGA REDDY COURT AT :: LB NAGAR.
O.V.O.P.No. 133 OF 2024.

Between:
Pathulothu Sathish ...Petitioner.
AND
Mungara Antharvedi and other ...Respondents.

To,
Mungara Antharvedi S/o Mungara Venkateswara Rao age: 59 years, Occu: Bussiness, R/o H.NO.C2-122, Ramalayam Center, Gudivakalanka, West Godavari, Andrapradesh, PIN Code:534004 (Owner of crime Vehicle Bearing No. AP 39 VA 2480

Please take notice that the above said petitioners filed the above O.P. No. 133/2024 against you and the cholamandalam Gen-insurance company.Ltd & Siriberi Durga Prasad, seeking compensation. The said case is stands posted on 24-06-2025 for your appearance therefore you are hereby required to be present before the Court of the Hon'ble Chairman Motor Accident Claims Tribunal-Cum-III ADDI.. District Judge, Ranaga Reddy Coürt, At: L. B Nagar, Hyderabad, on 24-06-2024 at 10.30 a.m., either in person or through an Advocate, failing which the case will be decided Ex-Parte.

//BY ORDER OF THE COURT//
NOMULA SAIDULU
Advocate,
Counsel for the Petitioners.
Cell: 9642967148